ఆలోచనే ఆయుధం

విన్నింగ్ మైండ్స్

కొత్తగా ఆలోచించండి.. గొప్పవాళ్లు అవ్వండి.. అదే విజేతల రహస్యం.. ఇటువంటి మాటలు, సలహాలు సూచనలై మీ జీవితంలోకి రోజూ వస్తూనే ఉన్నాయి. అది నిజమని మనందరికీ తెలుసు. కానీ అదే నిజాన్ని 'నిజంగా' మన నేటి యువతలో చూస్తున్న వారెంత మంది? అప్పుడే వచ్చేసిందిగా.. మన 75వ స్వాతంత్ర్య దినోత్సవం. నాటి నుండి నేటికి మారిందేమిటి? మనమందరం నిజాన్ని మరిచిపోయి అబద్ధానికి దాస్యం చేస్తూనే ఉన్నాము. మేము పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యోధులం, మాకు ఈ స్వాతంత్ర్యానికి, భారతీయతకు, నిజానికి సంబంధం ఏముంది? కష్టపడేది ఓ ప్రభుత్వ ఉద్యోగానికి, మంచి జీతానికి, అంతకుమించి మాకు ఏమీ అవసరం లేదు అని మీరు ఇది చదువుతున్నప్పుడు అనుకుంటే, ఇప్పటికైనా అటువంటి ఆలోచనల్లో బతుకుతున్నందుకు సిగ్గుపడి, నిజమైన భారతీయ సైనికుడిగా మారండి.

మా వల్ల ఇదంతా ఎందుకు అవుతుంది అని ఆలోచిస్తున్నారా? ఎందుకు అవ్వదు? ఆలోచించినప్పుడే అయిపోయింది అని అనుకొని మొదలుపెట్టండి. మీరందరూ పోటీ పరీక్షలకు చదువుతుంది జీతం కోసం కాదు, కొన్ని లక్షల మంది భారతీయుల గుండె చప్పుడుగా మారి వారిలో ఒకరై మన భారతాన్ని నిలబెట్టడానికి. మీరు సైనికులైనందుకు భారతీయత ఇచ్చే బోనస్ జీతం తప్ప, జీతం, హోదా పరమావధి కాదు.

ఒక్కసారి ఇలా ఆలోచించి, మీ పోటీ పరీక్షలకు చదవడం మొదలుపెట్టండి. అప్పుడు మీ దృక్కోణంలో స్వార్థం పోయి 'సమాజం' దర్శనమిస్తుంది. ఇప్పుడు చెప్పండి? ఇలా ఆలోచిస్తే, మీ ఆలోచన నిజమైన ఆయుధం కాదా? ఆలోచించండి.. ఆలోచించండి.. ఆలోచించండి.

మీరందరూ హక్కుల కోసం చదవొద్దు, 'హక్కులను, బాధ్యతలను' కలిపి చదవండి. ఓ పరీక్షలో విజయం సాధిస్తే ఎంత జీతం వస్తుంది, ఎన్ని సౌఖ్యాలు వెంట వస్తాయి అని ఆలోచిస్తున్నారు కానీ, ఆ ఉద్యోగ బాధ్యతల గురించి మీలో ఎంతమంది ఆలోచిస్తున్నారు. ఆ ఆలోచనే నేను ముందు చెప్పిన స్వాతంత్ర్యం, భారతీయత, నిజం. 'I'm an Indian' అన్నది చొక్కా మీద పెట్టుకునే జెండా గుర్తు కాదు, అది మనందరి ఉమ్మడి పౌరుల తత్వం. బాధ్యతల గురించి ఆలోచించిన ప్రతీసారి మీరు ఓ భారతీయుడే. వాటిని మరిచిపోయి కేవలం హక్కుల గురించే ఊహాల్లో గడిపేస్తున్నంత కాలం మీరు భారత ద్రోహులే.

ఇప్పుడు ఆలోచించండి.. మీరందరూ ఎందుకు ఇన్నిసార్లు ఒకే పరీక్షకు సిద్ధమవుతున్నారు? పోటీ పరీక్షలకు సిద్ధం అవ్వడం అంటే జీవితంతో 'పోటీ యుద్ధానికి మేము తయారుగా ఉన్నాం' అనే తత్వాన్ని నరనరాన నింపుకోవడం. కానీ మీరూ ఇదే తత్వంతో చదువుతున్నారా? ఇప్పుడు చెప్పండి మీ వైఫల్యానికి కారణం ఏమిటో?

అందుకే ఆలోచన అన్నది ఆయుధం. అది సరిగ్గా లేనప్పుడు కష్టం. ప్రతిభ కూడా రాణించదు. కనుక 'కష్టపడుతున్నాం' అన్న భ్రమలో బతకడం మానెయ్యండి. 'బాధ్యతతో భారతీయుడి'గా చదువుతున్నాం అన్న దృక్పథంతో చదవండి, విజయలక్ష్మి మీ చెంతే ఉంటుంది. ఈ విషయంలో మీకు అనుమానాలుంటే, నేనే మీ సమాధానమవుతాను.

అవుతుందా? అవదా? అని ఇక ఆలోచించడం మానేసి మొదలెట్టండి బాధ్యతతో చదవడం. బాధతో చదవొద్దు, బాధ్యతతో చదవండి ఇక నుండి అయినా ఈ ఆలోచన మీ మెదడులో, మీలో అణువణువు నిండిన రోజు మీరు విజయం సాధించినట్టే. ఇక మీరు బయటి విజయాలు వెతుక్కోవాల్సిన అవసరం లేదు. అవి మీకు బోనస్‌లు అంతే.

కొత్త ఆలోచనకు అర్థం ఇదే. బాధ్యతతో బాధను తరిమికొట్టినప్పుడు, నిజం మీ ఆలోచన అయినప్పుడు, కాదా విజయం మీ బానిస? గెలుపు కోసం మీరు దాని చుట్టూ తిరగవద్దు, మీ బాధ్యతతో దాన్ని మీ చెప్పుచేతల్లో ఉంచుకోండి. అప్పుడు ఈ ప్రపంచమే మీది.

\- రచన శ్రీ దత్తా..